E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన శేరిలింగంపల్లి నాయకులు » 3లో

హైదరాబాద్ (తేదీ) 09-01-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక: 09|| పేజీలు–6 www.ekaburu.com

17 ఏళ్ల షూటర్‌పై లైంగిక దాడి.. జాతీయ కోచ్ అంకుశ్‌పై వేటు » 6లో



24 ఏళ్ల బజాజ్-అలియాంజ్ బంధానికి బ్రేక్ » 4లో




మాల్‌లో చుట్టు ముట్టిన అభిమానులు.. నిధి అగర్వాల్ ఏమన్నారంటే? » 5లో



భారీ నష్టాల్లో సూచీలు.. ఒక్కరోజులోనే ₹8 లక్షల కోట్లు ఆవిరి!



» 4లో

## కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

ఈ కబురు, డెస్క్ ; మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులను దోషులుగా తేల్చి, మరణశిక్ష విధించింది. అయితే, వారిద్దరు భారత్‌లో ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు.



## నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు


- ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ధ్వజం

ఈ-కబురు, హైదరాబాద్ : నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రేవంత్ సర్కారు సాగిస్తున్న దమన కాండపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్, నేడు అశోక్ నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

తరువాయి 2లో



## జనగణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- రెండు దశల్లో జనగణన పూర్తి
- తొలి దశలో ఇళ్లగణన
- తొలిదశ ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు
- రెండో దశ ప్రక్రియ 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వరకు
- జనగణనతో పాటే కులగణన కూడా చేపట్టాలని కేంద్రం నిర్ణయం

దేశవ్యాప్తంగా జనగణనను కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 30 వ తేదీతో ఈ పక్రియ ముగియనుంది. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, భవనాలు, నిర్మాణాల వివరాలను సేకరించనున్నారు. దేశంలో ప్రతి పదేళ్ల కు ఒకసారి జనగణన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2021 లో ఈ జనగణన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంది. కానీ కోవిడ్ కారణంగా ఈ పక్రియను వాయిదా వేశారు. తాజాగా ఈ జనన గణన పక్రియను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ పక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వ తేదీ వరకు జరగనుంది. ఇక రెండో దశలో జనాభా లెక్కల పేకరణ వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనాభా లెక్కలు పూర్తిగా డిజిటల్ రూపంలో చేయనుంది.ఈ జనగణన తో పాటే కులగణనను సైతం చేపట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో కులగణన పక్రియను చేపట్టి పూర్తి చేసింది. దీనిని ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవాయప్తంగా కులగణన చేపడుతుందంటూ మోదీ ప్రభుత్వం పై ప్రధాన ప్రతిపక్షమైన కాంగెస్ పార్టీ విమర్శలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.

### రష్యా చమురు కొంటే 500 శాతం సుంకాలు..

## భారతే టార్గెట్?




- రష్యా నుండి చమురు కొనే దేశాలపై 500% వరకు సుంకాలు వేసేందుకు అమెరికా కొత్త ఆంక్షల బిల్లును తెస్తోంది.
- ఈ బిల్లుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ఇచ్చారని సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ధృవీకరించారు.
- చైనా, యూరోప్ కంటే ఈ పన్నుల ప్రభావం ప్రధానంగా భారత్, బ్రెజిల్‌లపైనే పడే అవకాశం ఉంది.
- ప్రభుత్వ సెలవుల కారణంగా ఈ బిల్లు చట్టంగా మారడానికి కనీసం మూడు వారాల సమయం పట్టవచ్చు.
- అమెరికా సీజ్ చేసిన రష్యా నౌక 'మరినెరా'లో ముగ్గురు భారతీయులు చిక్కుకుపోయి ఉన్నారు.

ఈకబురు : రష్యా నుంచి చమురు, యురేనియం కొంటూ ఉక్రెయిన్‌లో ఆ దేశం యుద్ధానికి సహకరిస్తున్న దేశాలపై 500 శాతం సుంకాలు వేసేందుకు అమెరికా కొత్త చట్టం తెస్తోంది. రష్యా ఆంక్షల బిల్లు కనుక చట్టరూపం దాలిస్తే భారత్, చైనా, బ్రెజిల్ తదితర దేశాలపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉంది. గ్రాహమ్‌బ్లూమెంథల్ ఆంక్షల బిల్లుగా నామకరణం చేసిన ఈ చట్టంతో రష్యా నుంచి కొనుగోలు చేయడం వల్ల పుతిన్ చేసే యుద్ధాలకు ఫండింగ్ దొరుకుతుందని తెలిసీ, కొనుగోళ్లు చేసే దేశాలపై 500 శాతం వరకు పన్నులు వేసే అధికారం ట్రంప్‌కు దక్కుతుంది. ఉక్రెయిన్‌రష్యా మధ్య శాంతి ఒప్పందం కోసం యూఎస్ ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో.. పుతిన్ సర్కారును ఆర్థికంగా దెబ్బతీసేందుకే అమెరికా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

తరువాయి 2లో

### శాస్త్ర విజ్ఞానం నాలుగు గోడల మధ్యే ఆగిపోకూడదు 3లో

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు





## ఈడీ దాడులు జరుగుతుండగా.. ఐప్యాక్ చీఫ్ ఇంటికి మమతా బెనర్జీ

కోల్‌కతా: రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేపట్టింది. ఆ సంస్థ డైరెక్టర్ ఇప్రాంగణాల్లో గురువారం ఉదయం నుంచి సోదాలు జరుపుతోంది. 2లో

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్...

## మొదటి విడతలో బాలికలకు ప్రాధాన్యం

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందజేతపై కసరత్తు
- వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి నగరంలో నూతన పాఠశాలలు
- ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు సిలబస్
- విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ఈ-కబురు, హైదరాబాద్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ ఎస్) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు.



తరువాయి 2లో

## వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారు



ఈ కబురు, హైదరాబాద్: అధికారం ఉంది కదా అని మోదీ సర్కార్ ఇష్టానుసారం వ్యవహరిస్తోందని.. పేదలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం మార్పునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేపట్టిన దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా.. గురువారం గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. బ్రిటీష్ పాలన తరహాలో మోదీ పాలన ఉంది. ఎన్డీయే కూటమికి అనుకున్నంత మెజారిటీ రాకపోవడంతో రాజ్యాంగాన్ని మార్చలేకపోయారు. అందుకే వేరే రూపంలో హక్కులను కాలరాస్తున్నారు. ఓటు హక్కు తీసేసే కుట్రలో భాగంగా ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. కోట్లాది మంది పేదలను దేశ పౌరులే కాదని చూపించేందుకు కుట్రపూరితంగా ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని బీజేపీ రద్దు చేయబోతోంది.

తరువాయి 3లో

## చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా

### రూ. 1.24 కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం



ఈ-కబురు, హైదరాబాద్: సంక్రాంతి పండుగ వేళ పర్యావరణానికి, పక్షులకు హాని కలిగించే నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. నగర కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజాపై ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, మాట్లాడుతూ.

తరువాయి 2లో

## ఈడీ దాడులు జరుగుతుండగా..
# ఐప్యాక్ చీఫ్ ఇంటికి మమతా బెనర్జీ

మొదటి పేజీ తరువాయి

మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (Mamata Banerjee).. ప్రతీక్ జైన్ నివాసానికి వెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది.
ఈడీ అధికారులు జైన్ నివాసంలో తనిఖీలు చేస్తుండగా మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీసు కమిషనర్ మనోజ్ వర్మ అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా దీదీ మాట్లాడుతూ.. ఈ సోదాలు రాజ్యాంగవిరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ తనిఖీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ''మా పార్టీ రాజకీయ వ్యూహం, అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీతో ఈ దాడులు చేయిస్తున్నారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌ను తీసుకునేందుకు ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారు'' అని బెంగాల్ సీఎం ఆరోపించారు.అయితే, ఈడీ దాడులు జరుగుతుండగా ప్రతీక్ జైన్ నివాసానికి సీఎం వెళ్లడంపై పశ్చిమబెంగాల్ (West Bengal) ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు సువేందు అధికారి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇది దర్యాప్తులో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడమే అవుతుందన్నారు. ఇలాంటి ప్రవర్తన అనైతికం అని మండిపడ్డారు. ప్రస్తుతం ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి.
ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడైన ప్రతీక్ జైన్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగానికి హెడ్‌గానూ వ్యవహరిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి టీఎంసీతో కలిసి ఐప్యాక్ పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థపై ఈడీ ఎందుకు సోదాలు జరుపుతోందన్న విషయంపై మాత్రం స్పష్టత లేదు. అయితే, మరికొన్ని నెలల్లో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.



## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్..
# .మొదటి విడతలో బాలికలకు ప్రాధాన్యం

ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు ఒకొక్కటి చొప్పున వైఐఐఆర్ ఎస్ ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. విద్యా శాఖపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వైఐఐఆర్‌సీలో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని పీఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. వైఐఐ ఆర్ ఎస్ ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల్లలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణవ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సీఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాలకు లీజు తీసుకునే అంశంపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాలు నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాచుపల్లి పాఠశాల స్థలం కేవలం అర ఎకరం మాత్రమే ఉండడంపై సీఎం ఆరా తీశారు. ఎక్కడైనా పాఠశాలకు కనీసం ఎకరంన్నర స్థలం ఉండాలని, బాచుపల్లి ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఎకరంన్నర ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన కోర్సులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నందున దానిని త్వరగా అమలయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని సీఎం అన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## ఇంధనంపై అత్యాశే అసలు కారణం'.. అమెరికాపై వెనెజువెలా మండిపాటు!



తమ దేశంలో చమురు నిల్వలకు సంబంధించి అమెరికా నిర్ణయాలపై వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ విరుచుకుపడ్డారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ప్రజాస్వామ్యం, మానవ హక్కులకు సంబంధించి అగ్రరాజ్యం చేస్తున్న ఆరోపణలు సాకులు మాత్రమేనని.. తమ దేశంపై ఒత్తిడి వెనుక ఇంధన వనరులపై అత్యాశే అసలు కారణమని విమర్శించారు. పార్లమెంటు సభ్యుల సమావేశంలో ఆమె ఈమేరకు మాట్లాడారు. వెనెజువెలా ఇంధన వనరులను ఏళ్లపాటు నియంత్రిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన వేళ ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

"ఉత్తర ప్రాంతం (అమెరికా) ఇంధన అత్యాశ.. మన దేశ వనరులను కోరుకుంటోందని మీ అందరికీ తెలుసు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల వంటి ఆరోపణలు కేవలం సాకులే" అని అన్నారు. పరస్పర సహకారంతో ఇరుపక్షాలు ప్రయోజనం పొందే ఇంధన సంబంధాలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు కలిసి పనిచేయాలని రాజకీయ పక్షాలకు పిలుపునిచ్చారు. దేశంలో అతివాద, ఫాసిస్ట్ భావజాలాన్ని అనుమతించలేమని స్పష్టం చేశారు.

వెనెజువెలా 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును అమెరికాకు అప్పగించనున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ద్వారా సమకూరే డబ్బుతో అగ్రరాజ్యంలో తయారైన ఉత్పత్తులనే వెనెజువెలా కొనుగోలు చేస్తుందన్నారు. ఇది రెండు దేశాల ప్రజలకూ ప్రయోజనం చేకూర్చుతుందని చెప్పారు.

## రష్యా చమురు కొంటే 500 శాతం సుంకాలు..
# భారతే టార్గెట్?




మొదటి పేజీ తరువాయి

ఈ రష్యా ఆంక్షల బిల్లుకు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా మద్దతిచ్చారని రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ చెప్పారు. వైట్‌హౌస్‌లో ట్రంప్‌ను కలిసిన ఆయన ఈ బిల్లు గురించి వివరించారు. 'ఇది సరైన సమయంలో వస్తున్న బిల్లు. ఎందుకంటే శాంతి కోసం ఉక్రెయిన్ కొన్ని త్యాగాలు చేయడానికి సిద్ధం అవుతోంది. కానీ రష్యా మాత్రం కేవలం మాటలకే పరిమితమై, అమాయకులను చంపుతోంది' అని గ్రాహమ్ అన్నారు. వచ్చే వారమే ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించే అవకాశం ఉందని ఆయన చెప్పినప్పటికీ.. వచ్చే వారం సెనేట్‌లో ప్రభుత్వ ఫండింగ్ ప్యాకేజీపై చర్చ జరిపేందుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఇది సాధ్యం కాకపోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఆ తదుపరి వారంలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ డే కారణంగా సెనేట్‌కు విరామం ఇస్తారని తెలుస్తోంది. కాబట్టి రష్యా ఆంక్షల బిల్లు చర్చకు రావాలంటే కనీసం మూడు వారాలు సమయం పట్టే అవకాశం ఉంది.రష్యా నుంచి చమురు, యురేనియంను యూరప్‌కు చెందిన కొన్నిదేశాలు, చైనా కొంటున్నాయి. భారత్, బ్రెజిల్ ప్రధానంగా రష్యా చమురునే కొంటున్నాయి. అయితే చైనాతో ప్రత్యేకంగా యూఎస్‌కు వాణిజ్య పోరు నడుస్తున్న నేపథ్యంలో కొత్త బిల్లు తెచ్చినా డ్రాగన్ దేశంపై యూఎస్ ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేకపోవచ్చు. ఎందుకంటే యూఎస్ కనుక చైనాపై సుంకాలు వేస్తే.. చైనా కూడా అదే స్థాయిలో యూఎస్‌పై సుంకాలు వేసే చాన్స్ ఉంది. యూరప్ దేశాలపై కూడా యూఎస్ పెద్దగా ఫోకస్ పెట్టకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం కేవలం భారత్, బ్రెజిల్ మీదనే యూఎస్ 50 శాతం సుంకాలు విధిస్తోంది. తాజాగా వెనిజులాపై యూఎస్ సైనిక చర్య తర్వాత బ్రెజిల్ కూడా రష్యాతో డీల్ నుంచి వెనక్కు తగ్గే అవకాశాలున్నాయని నిపుణుల అంచనా. దీంతో ఈ బిల్లు కనుక చట్టరూపం దాలిస్తే.. ప్రధానంగా భారత్ మీదనే ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అంటున్నారు.రష్యాకు చెందిన 'మరినెరా' అనే ఓడను యూఎస్ దళాలు సీజ్ చేయడంపై మాస్కో మండిపడింది. ఈ క్రమంలోనే రష్యా చట్టసభ సభ్యుడు అలెక్సీ జురావ్లేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా కనుక ఇలాంటి చర్యలు కొనసాగిస్తే మిలిటరీ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రష్యా ఈ చర్యలపై కఠినంగా స్పందించాలన్న ఆయన.. 'టోర్పెడోలతో కొన్ని అమెరికన్ కోస్ట్ గార్డ్ నౌకలు ముంచేయాలి. మామూలుగానే వాళ్లు యూఎస్ తీరం నుంచి వేల కిలోమీటర్ల వరకు కాపలా కాస్తుంటారు కదా' అని చెప్పారు. వెనిజులాపై మిలిటరీ చర్య సక్సెస్ కావడంతో ప్రస్తుతం అమెరికా ఏం చేసినా చెల్లుతుందనే మూడ్‌లో ఉందని, ఇలా కొన్ని ఓడలు ముంచేస్తేనే మళ్లీ వాస్తవ ప్రపంచంలోకి యూఎస్ తిరిగొస్తుందని వివరించారు.మరినెరా నౌకను సీజ్ చేసిన యూఎస్.. ఆ నౌకలో పనిచేస్తున్న సిబ్బందిపై కేసులు పెడతామని ప్రకటించింది. ఈ నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉన్నారని అధికారులు చెప్తున్నారు. వీరిలో ముగ్గురు భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. తమ సిబ్బందిని గౌరవంగా చూసుకోవాలని, విదేశీయులను వెంటనే వదిలిపెట్టేయాలని అమెరికా ప్రభుత్వాన్ని రష్యా కోరింది. ఈ నౌకలోని సిబ్బందిలో 17 మంది ఉక్రేనియన్లు, ఆరుగురు జార్జియన్లు, ముగ్గురు భారతీయులు, ఇద్దరు రష్యన్లు ఉన్నారని తెలుస్తోంది.

# చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా

"సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆనందాల హేళ. అయితే, మన సంతోషం మరొకరి ప్రాణానికి ముప్పుగా పరిణమించకూడదు. పర్యావరణానికి, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే 'చైనీస్ మాంజా'పై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నారు. నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. నిబంధనలు అతిక్రమిస్తే తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం," అని హెచ్చరించారు. దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈకామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఆన్‌లైన్‌లో మాంజా కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.కేసులు మరియు స్వాధీనం వివరాలు..... నగరవ్యాప్తంగా అన్ని జోన్లలో నిర్వహించిన దాడులలో ఇప్పటివరకు మొత్తం 103 కేసులు నమోదు కాగా, 143 మంది నిందితులను అరెస్టు చేయడం జరిగింది. వీరి నుంచి రూ.



1,24,52,000 (ఒక కోటి ఇరవై నాలుగు లక్షల యాభై రెండు వేలు) విలువైన 6,226 మాంజా బాబిన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జోన్ల వారీగా గణాంకాలను పరిశీలిస్తే.. సౌత్ వెస్ట్ జోన్‌లో అత్యధికంగా 34 కేసులు నమోదు కాగా, 46 మందిని అరెస్టు చేసి, రూ. 65,30,000 విలువైన 3,265 బాబిన్లను సీజ్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో సౌత్ జోన్ లో 27 కేసులు నమోదు కాగా, 35 మందిని అరెస్టు చేసి రూ. 37,22,000 విలువైన 1,861 బాబిన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ జోన్ లో 18 కేసులు (29 అరెస్టులు, రూ. 6.02 లక్షల విలువైన 301 బాబిన్లు), సౌత్ ఈస్ట్ జోన్ లో 09 కేసులు (10 అరెస్టులు, రూ. 4.42 లక్షల విలువైన 221 బాబిన్లు) నమోదయ్యాయి. ఇక సెంట్రల్ జోన్ లో 06 కేసులు, నార్త్ జోన్ లో 05 కేసులు, వెస్ట్ జోన్ లో 04 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా, ఈ దాడులలో హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ కీలక పాత్ర పోషించింది. మొత్తం నమోదైన కేసుల్లో 67 కేసులు టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలోనే నమోదు కాగా, 87 మందిని అదుపులోకి తీసుకొని రూ. 68.78 లక్షల విలువైన సరుకును సీజ్ చేశారు. "ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, ఐపిఎస్, డిసిపిలు కారె కిరణ్ ప్రభాకర్, ఐపిఎస్, శ్రీ జి. చంద్రమోహన్, ఐపిఎస్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐపిఎస్, అడిషనల్ డిసిపి (టాస్క్ ఫోర్స్) అందె శ్రీనివాస్ రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులను, వారి బృంద సభ్యులను మరియు సిబ్బందిని అభినందించి, నగదు బహుమతులను అందజేశారు."

# నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు అశోక్ నగర్ లైబ్రరీ చుట్టూ చక్కర్లు కొట్టి పొర్లుదండాలు పెట్టి నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. వారి ఉద్యోగ కాంక్షను ఆసరా చేసుకొని, వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చుకొని ఇంటింటికి తిప్పి ప్రచారానికి వాడుకుని.. అధికార పీఠం ఎక్కగానే అదే నిరుద్యోగ గొంతులపై ఉక్కు పాదం మోపి తొక్కుతున్నారని ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినాక బోడ మల్లన్న అన్నట్లు ఇప్పుడు నిరుద్యోగులకు లాఠీ చార్జీలు, అరెస్టులు, సంకెళ్లను బహుమతిగా ఇస్తున్నారని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.



**––జాబ్ లెస్ క్యాలెండర్‌గా జాబ్ క్యాలెండర్..** మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేశారని మండిపడ్డారు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నవు..నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాలయాల్లో పోలీసులు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఈ రోజు గాయపడిన ప్రతి నిరుద్యోగికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పి తీరాలి. దాడికి బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. నిర్బంధాలను ఆపి నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులను లాకప్ హింసకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా BRS చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అరెస్టు చేసిన నిరుద్యోగ సోదరులను భేషరతుగా తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు

# అమరావతి గ్రీన్‌సిటీ.. విజయవాడ క్లీనెస్ట్ సిటీ: సీఎం చంద్రబాబు



ఈ కబురు, విజయవాడ: అమరావతి ఆవకాయ్ ఉత్సవాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత విజయవాడ ప్రజలదేనని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగు సినిమా, సాంస్కృతిక, కళా, సాహిత్య మేళవింపుగా విజయవాడలో మూడు రోజులపాటు నిర్వహించే అమరావతి ఆవకాయ్ ఉత్సవాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అమరావతి దేవతల రాజధాని, వేంకటేశ్వరస్వామి దీవెనలతో అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంతమంది ఎంత బాధపడినా అమరావతి బెస్ట్ సిటీ.. డైనమిక్ సిటీ అని పేర్కొన్నారు. కృష్ణా నది వద్ద ఒక గంట ఉంటే మెడిటేషన్ కూడా అవసరం లేదన్నారు. అమరావతి గ్రీన్‌సిటీ.. విజయవాడ క్లీనెస్ట్ సిటీ అని సీఎం అన్నారు. ఉత్సవాల్లో భాగంగా పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదికపై సాహిత్య చర్చలు, కవితా పఠనం, సంగీతం, నృత్యం, నాటకాలు, సదస్సులు నిర్వహించనున్నారు. కృష్ణా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన హౌస్ బోట్లను సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదతరులు పాల్గొన్నారు. ఉత్సవాలను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తెరపైకి నదీ జలాల అంశం

ఈ కబురు, కరీంనగర్: కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించలేదన్నారు. ''వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయి. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరురంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది'' అని బండి సంజయ్ అన్నారు



# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన శేరిలింగంపల్లి నాయకులు

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేటీఆర్ సూచన

ఈకబురు, శేరిలింగంపల్లి : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ రామారావును గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు నంధీనగర్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో కేటీఆర్ ను కలిసిన నాయకులు ఆయనతో సమావేశమయ్యారు. పునర్విభజన అనంతరం ఏర్పాటైన గచ్చిబౌలి, నల్లగండ్ల డివిజన్ల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నార. ఈ సందర్భంగా రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేటీఆర్ నాయకులకు సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, జిహెచ్ఎంసి ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి, చేసిన అభివృద్ధిని గుర్తు చేయాలని, పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించే విధంగా కృషి చేయాలని అన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ సాయిబాబా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత పటిష్టంగా ఉందని, నియోజకవర్గంలో పటిష్టమైన క్యాడర్ బీఆర్ఎస్ సొంతమని అన్నారు. గచ్చిబౌలి, నల్లగండ్ల డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నార. ఈ కార్యక్రమంలో

**,రాగం రంగస్వామి యాదవ్, గచ్చిబౌలి మాజీ వార్డు సభ్యులు రాగం జంగయ్య యాదవ్, రాగం హరిశంకర్ యాదవ్, శాంకరీ రాజు ముదిరాజ్, దారుగుపల్లి పరిమేష్, కొల్లేరు సతీష్ తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు**



పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సాయిబాబా, బిఆర్ఎస్ నాయకులు



పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సాయిబాబా, బిఆర్ఎస్ నాయకులు

మొదటి పేజీ తరువాయి

# చెట్టును ఢీ కొన్న కారు... నలుగురు విద్యార్థుల దుర్మరణం





ఈ కబురు, శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మీర్జాగూడ వద్ద చెట్టును కారు ఢీ కొట్టిన ఘటనలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు ఐసీఎఫ్ఏఐ వర్సిటీ విద్యార్థులు కాగా, మరొకరు ఎంజీఐటీ విద్యార్థి. మృతులను సూర్యతేజ, సుమిత్, శ్రీనిఖిల్, రోహిత్‌గా గుర్తించారు. నక్షత్ర అనే విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరంతా మోకిల నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

# చేయని నేరానికి 54 రోజులు జైల్లో.. బాధితుడికి రూ.14లక్షల పరిహారం




ఈ కబురు, నెట్ వర్క్ : ఓ చోరీ కేసుకు సంబంధించి పోలీసు అధికారుల బాధ్యతారాహిత్యంపై కేరళ హైకోర్టు మండిపడింది. వారి తీరువల్ల ప్రవాస భారతీయుడు అనవసరంగా శిక్ష అనుభవించాడని, ఆయన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని తెలిపింది. ఇందుకు పరిహారంగా అతడికి రూ.14లక్షలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా ఈ పరిహారాన్ని ఆయా అధికారుల నుంచి రికవరీ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. కన్నూర్ జిల్లాలోని తలస్సేరీకి చెందిన తాజుద్దీన్ ఖతార్‌లో పని చేసేవారు. 2018లో ఓసారి సెలవుల్లో కేరళకు వచ్చారు. ఓ రోజు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ జీపు.. తాజుద్దీన్ నివాసానికి సమీపంలోని బురదలో ఇరుక్కుపోయింది. అటుగా వాహనంలో వెళ్తున్న తాజుద్దీన్‌ను సహాయం చేయాలని కోరగా.. తనకు వెన్నునొప్పి ఉందని చెబుతూ కిందకు దిగేందుకు నిరాకరించాడు. దీంతో కోపోద్రిక్తులపైన పోలీసులు అతడిని వాహనం నుంచి బయటకు దింపి, బెదిరించారు. ఆ తర్వాత ఓ చోరీ కేసులో తాజుద్దీన్‌ను ఇరికించిన పోలీసులు.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 54 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన.. బెయిల్‌పై బయటకు వచ్చి కతార్‌కు వెళ్లిపోయారు. అయితే, ఉద్యోగం నుంచి చెప్పకుండానే వెళ్లిపోయాడని ఆరోపిస్తూ తాజుద్దీన్‌పై అక్కడి సంస్థ కేసు వేసింది. ఆ కేసులో 23 రోజుల పాటు జైల్లో ఉన్న ఆయన.. చివరకు స్వదేశానికి వచ్చి న్యాయపోరాటం చేశారు. అదే సమయంలో ఓ కేసులో అరెస్టయిన నిందితుడు.. కన్నూర్‌లో చోరీకి పాల్పడింది తానేనని అంగీకరించాడు. దీంతో పోలీసుల బాధ్యతారాహిత్యాన్ని నిర్ధరించిన న్యాయస్థానం.. వారి అహం కారణంగానే ఈ కేసులో ఇరికించినట్లు తేల్చింది.

# శాస్త్ర విజ్ఞానం నాలుగు గోడల మధ్యే ఆగిపోకూడదు







ఈ కబురు, హైదరాబాద్: సమాజం కోసం ఆలోచించడం, పని చేయడం 'ఈనాడు' డీఎన్ఏలోనే ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శాస్త్రీయ అంశాలకు పత్రికలో ప్రముఖ స్థానం కల్పిస్తోందని చెప్పారు. తెలుగు పత్రికా రంగంలో విప్లవాన్ని సృష్టించిన రామోజీరావు ఒక ధ్రువతార అని కొనియాడారు. నగరంలోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లో 'ఈనాడు' గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ల్యాబ్ టూ సొసైటీ రోల్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ ఇన్ బిల్డింగ్ వీబీ2047' కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ''క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి రామోజీరావు సొంతం. తెలుగు పాఠకులకు శాస్త్ర విజ్ఞానాన్ని అందించాలని ఆయన తాపత్రయపడ్డారు. సమాజంలో శాస్త్ర, సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందించడం మరింత అవసరం. శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చేరవేయాలి. సమాజంలో శాస్త్ర, సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందించాలి. దీనిపై అవగాహన పెంచే బాధ్యత శాస్త్రవేత్తలు, నిపుణులు తీసుకోవాల్సిన అవసరముంది. శాస్త్రవిజ్ఞానం నాలుగు గోడల మధ్యే ఆగిపోకూడదు.. ప్రజలకు చేరాలి. విద్యార్థుల్లో సైన్స్‌పై ఉత్సుకతను మరింత పెంచాలి. క్లిష్టమైన సైన్స్ అంశాలను సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా 'ఈనాడు'లో జ్ఞాననేత్రం శీర్షికన వార్తలు వచ్చేవి. సైన్స్‌పై ఎంత ఆదరణ పెంచగలిగితే ఆ రంగంలో దేశం అంత ముందుంటుంది. మన దేశంలో మేధస్సుకు కొదవ లేదు. రామానుజం, శకుంతలాదేవి, సీవీ రామన్ వంటి ప్రముఖులు దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు స్వదేశీ పరిజ్ఞానంతో ఉపగ్రహాలు, క్షిపణులను తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి మనం చేరుకోవడం సంతోషించదగ్గ విషయం. శాస్త్ర విజ్ఞానంలో అగ్రస్థానంలో భారత్ ఉండాలన్నదే మన లక్ష్యం. మానవ జీవన నాణ్యత పెంచడంలో శాస్త్ర సాంకేతికత పాత్ర చాలా కీలకమైనది. ఈ రంగంలో దూసుకెళ్లేందుకు ప్రైవేటు సంస్థలు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయి. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ కృషి వల్లే ఆహార రంగంలో భారత్ స్వయంసమృద్ధిని సాధించింది'' అని వెంకయ్యనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో 'ఈనాడు' ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎస్‌టీసీ గౌరవ అధ్యక్షుడు డా.ఆర్‌బీఎన్ ప్రసాద్, ఎస్‌ఏసీఏఎస్‌టీసీ ఛైర్మన్ డా.సీహెచ్ మోహన్‌రావు, డబ్ల్యూహెచ్‌వో మాజీ శాస్త్రవేత్త డా.సౌమ్యా స్వామినాథన్, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డా.పావులూరి సుబ్బారావు, సీఎస్ఐఆర్ డైరెక్టర్ డా.డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష



**ఈ కబురు, డెస్క్ ; మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులను దోషులుగా తేల్చి, మరణశిక్ష విధించింది. అయితే, వారిద్దరు భారత్‌లో ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు. దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులు.. ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంఫెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వీటికి సంబంధించిన ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా.. దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.**

# బాగున్నారా.. అమ్మా.. మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు

ఈ కబురు, గజ్వేల్: ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ (KCR) ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సం





# వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారు



ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడబోతోంది ఉపాధి హామీ పథకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. భూమిలేని పేదలకు ఆహార భద్రత కల్పించేందుకే కాంగ్రెస్ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చింది. ఈ పథకం వల్ల గ్రామాల్లో విప్లవాత్మక మార్పులొచ్చాయి. వలసలు ఆగిపోయాయి.. వెట్టిచాకిరీ ఆగింది. దేశంలో 80 శాతం ప్రజలు ఈ పథకం ఆధారపడి బతుకుతున్నారు. అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పథకాన్ని మార్చి పేదలకు అన్యాయం చేస్తున్నారు. పేదలపై కక్ష పూరితంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అదానీ, అంబానీలకు తక్కువ ధరకు కూలీలు దొరకడం లేదని పథకాన్ని మారుస్తున్నారు. కార్పొరేట్ కంపెనీల కోసమే ఇలా చేస్తున్నారు. గతంలో వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చారు. ఆ నల్ల చట్టాలను ఉపసంహరించుకునేలా చేయడమే కాకుండా మోదీతో జాతికి క్షమాపణ చెప్పించింది కాంగ్రెస్. ఇప్పుడు అదే పని చేయబోతున్నాం. మోదీ క్షమాపణలు చెప్పేంత వరకు వదిలేది లేదు. ఉపాధి హామీ చట్టంలో మార్పులకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశాం. ఈ నెల 20 నుంచి గ్రామ సభలు నిర్వహిద్దాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ నేను కూడా ఓ మండలం బాధ్యత తీసుకుంటా. అన్ని మండలాలకు ఒక్కొకకకరు బాధ్యత తీసుకోవాలి. ఫిబ్రవరి 3 నుంచి అన్ని జిల్లాల్లో రోజుకు లక్ష మందితో సభ పెడదాం. హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లాల్లో సభలు పెడతాం. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించేంత వరకు మోదీ సర్కార్‌పై యుద్ధం ఆగదు. బీఆర్ఎస్‌ను వరుసగా అన్ని ఎన్నికల్లో ఓడించాం. మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలిచి తీరతాం. బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయాలే తప్ప ప్రజాసమస్యలు పట్టడం లేదు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారు అని రేవంత్ అన్నారు.


## 24 ఏళ్ల బజాజ్-అలియాంజ్ బంధానికి బ్రేక్

దిల్లీ: బజాజ్‌కు చెందిన జీవిత బీమా వ్యాపారంలో అలయాంజ్‌తో ఉన్న సుదీర్ఘ భాగస్వామ్యం ముగిసింది. జర్మనీకి చెందిన అలియాంజ్ ఎస్‌ఈకి ఉన్న 23 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ గురువారం తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. దీంతో 24 ఏళ్ల పాటు కొనసాగిన జాయింట్ వెంచర్ భాగస్వామ్యం ముగిసింది. దీంతో బీమా వ్యాపారం పూర్తిగా బజాజ్ గ్రూప్ చేతుల్లోకి వచ్చింది.

బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అలియాంజ్ వాటాను ప్రమోటర్ గ్రూప్ సంస్థలైన బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్, జమన్‌లాల్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి కొనుగోలు చేసినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ వెల్లడించింది. జనరల్ ఇన్సూరెన్స్‌లో వాటా కోసం రూ.12,190 కోట్లు, లైఫ్ ఇన్సూరెన్స్‌లో వాటాకు రూ.9200 కోట్లు చొప్పున మొత్తం రూ.21,390 కోట్లు వెచ్చించినట్లు పేర్కొంది. ఈ లావాదేవీతో ఇరు సంస్థల్లో బజాజ్ వాటా 74 శాతం నుంచి 97 శాతానికి పెరిగింది. రెండు సంస్థల్లో బజాజ్ ఫిన్‌సర్వ్‌కు 75.01 శాతం వాటా ఉంది.

ఈ కొనుగోలుతో మార్కెట్‌ను మరింత విస్తరించడానికి, కొత్త ఉత్పత్తులు తీసుకురావడానికి వ్యూహాత్మక సౌలభ్యం లభిస్తుందని బజాజ్ ఫిన్‌సర్వ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ బజాజ్ పేర్కొన్నారు. 'అందరికీ బీమా' ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని మేడిన్ ఇండియా, మేడ్ ఫర్ ఇండియా, మేడ్ బై ఇండియా ద్వారా సాకారం చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే బజాజ్ తన బీమా వ్యాపారాల సంస్థల పేర్లను బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌గా మార్చింది. ఇంతకుమునుపు వీటి పేర్లు బజాజ్ అలయాంజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌గా ఉండేవి.

## భారీ నష్టాల్లో సూచీలు.. ఒక్కరోజులోనే ₹8 లక్షల కోట్లు ఆవిరి!



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్ అమెరికా మధ్య వాణిజ్యంపై సందిగ్ధత నెలకొన్న వేళ.. సూచీలు భారీ ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రష్యాను కట్టడి చేసేందుకు భారత్ వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు, భౌగోళిక ఉద్రిక్తతల వంటివీ ఆజ్యం పోశాయి. దీంతో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 26వేల దిగువన ముగిసింది. దీంతో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు దిగొచ్చింది. సెన్సెక్స్ ఉదయం 84,778.02 (క్రితం ముగింపు 84,961.14) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,110.10 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 263.90 పాయింట్ల నష్టంతో 25,876.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 60.35 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం 4,426.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**కారణాలు ఇవీ..**

రష్యాపై ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ ఆమోదం తెలిపారు. దీంతో రష్యా ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై 500 శాతం వరకు టారిఫ్ విధించే అధికారం అధ్యక్షుడికి లభిస్తుంది.భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ తాజా హెచ్చరికల నేపథ్యంలో ఈ బిల్లు తీసుకురావడం మదుపర్లలో భయాలు పెంచింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా రూ.1527 కోట్ల ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించారు. ఈ ఒక్క నెలలోనే రూ.5,760 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం ప్రతికూల ప్రభావం చూపింది.భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు మన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఆసియాలో జపాన్ నిక్కీ, హాంగ్‌కాంగ్ హాంగ్‌సంగ్ నష్టాల్లో ముగిశాయి. నిన్నటి అమెరికన్ మార్కెట్లు సైతం నష్టాలు చవిచూశాయి.

## మైక్రోసాఫ్ట్ లో 22వేల మందికి లేఆఫ్‌లంటూ వార్తలు.. కంపెనీ సమాధానమిదే..!

**కృత్రిమ మేధ వినియోగం వేళ దిగ్గజ కంపెనీల్లో లేఆఫ్‌లు గత కొంతకాలంగా టెక్ రంగాన్ని కుదిపేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ మైక్రోసాఫ్ట్‌లో మరోసారి భారీఎత్తున తొలగింపులంటూ (Microsoft Layoffs) ఓ నివేదిక రావడం గందరగోళానికి గురిచేసింది. జనవరిలో దాదాపు 22వేల మందికి కంపెనీ ఉద్వాసన పలకనుందన్న వార్త ఉద్యోగుల్లో ఆందోళనకు దారితీసింది. దీంతో ఈ ప్రచారంపై కంపెనీ (Microsoft) స్పందిస్తూ.. అవన్నీ నిరాధార వార్తలని స్పష్టం చేసింది. అసలేం జరిగిందంటే..?**




టిప్‌ర్యాంక్స్(రీసెర్చ్ అండ్ అనాలసిస్ కంపెనీ) నివేదికతో ఈ ప్రచారం మొదలైంది. ఈ ఏడాది జనవరిలో మైక్రోసాఫ్ట్ 11వేల నుంచి 22వేల మంది ఉద్యోగులకు లేఆఫ్‌లు (Layoffs) ఇవ్వాలని భావిస్తున్నట్లు ఆ నివేదిక పేర్కొంది. అజ్యూర్ క్లౌడ్ సర్వీసెస్, ఎక్స్‌బాక్స్, గ్లోబల్ సేల్స్ ఆపరేషన్స్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండొచ్చని తెలిపింది. ఖర్చులు పెరగడం, కృత్రిమ మేధలో పెట్టుబడులు వంటి కారణాలతో ఈ తొలగింపులు చేపట్టాలని మైక్రోసాఫ్ట్ యోచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. దీంతో ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**సంపద సృష్టికి బంగారం మేలు**

ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ ఎక్స్ షా సోషల్ మీడియాలో స్పందించారు. ''ఇవన్నీ 100శాతం నిరాధార వార్తలే. ఉద్యోగుల కోత అవాస్తవం'' అని వెల్లడించారు. అంతకుముందు విండోస్ సెంట్రల్ ఎడిటర్ జెజ్ కార్డన్ స్పందిస్తూ.. లేఆఫ్‌ల సమాచారం తప్పని తెలిపారు. అయితే, దీనిపై కంపెనీ తరఫున మైక్రోసాఫ్ట్ అధికారిక ప్రకటన ఏదీ విడుదల చేయలేదు. గతేడాది జులైలో మైక్రోసాఫ్ట్ భారీ సంఖ్యలో తొలగింపులు చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు 9వేల మందికి లేఆఫ్ నోటీసులు ఇచ్చింది. అప్పట్లో దీనిపై ఎక్స్‌బాక్స్ హెడ్ ఫిల్ స్పెన్సర్ మాట్లాడుతూ.. కంపెనీ దీర్ఘకాల ప్రణాళికలో భాగంగా ఈ కోతలు తప్పలేదని పేర్కొన్నారు. ఆ లేఆఫ్‌ల సమయంలోనే పలు గేమ్ ప్రాజెక్ట్‌లను కంపెనీ రద్దు చేసుకుంది. కొన్ని స్టూడియోలను మూసేసింది. మరోవైపు గతేడాది జులై నాటికి మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 4 ట్రిలియన్ల మార్క్‌ను తాకడం గమనార్హం.

## రహస్య సమాచారం లీక్.. 'బ్యాంక్ ఆఫ్ అమెరికా'కు సెబీ నోటీసులు..!



భారత స్టాక్ మార్కెట్లకు చెందిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉల్లంఘించిందని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ (SEBI) ఆరోపించింది. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ స్టాక్ విక్రయాలకు సంబంధించిన డీల్ వేళ రహస్య సమాచారాన్ని లీక్ చేసిందని పేర్కొంది. అంతేగాక, ఈ వ్యవహారంపై దర్యాప్తును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసిందంటూ బ్యాంక్ ఆఫ్ అమెరికా (Bank of America)కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గత నవంబరులోనే ఈ నోటీసులను జారీ చేయగా.. తాజాగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం వెల్లడించింది.2024 మార్చిలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ స్టాక్ విక్రయాలకు సంబంధించిన లావాదేవీలను భారత్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించింది. ఈ విక్రయాల విలువ దాదాపు 177 మిలియన్ డాలర్లు. ఆ సమయంలో స్టాక్ ధర, ఇతర రహస్య వివరాలను బ్యాంకు డీల్ టీమ్.. ఉద్యోగులు, ఇన్వెస్టర్లతో పంచుకుందని ఓ ప్రజావేగు ఆరోపించారు. దీంతో బ్యాంక్ ఆఫ్ అమెరికా అంతర్గత దర్యాప్తు జరిపి.. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని పేర్కొంది.

ఈ క్రమంలోనే ఈ వ్యవహారంపై సెబీ దర్యాప్తు చేపట్టగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ డీల్ విషయంలో అంతర్గత నైతిక కట్టుబాట్లను విస్మరించి బ్యాంక్ ఆఫ్ అమెరికా డీల్ టీమ్ రహస్య సమాచారాన్ని బయటపెట్టిందని సెబీ పేర్కొంది. వాస్తవాలను దాచి.. తప్పుడు స్టేట్‌మెంట్లతో దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని ఆరోపించింది. అయితే, దీనిపై బ్యాంక్ ఆఫ్ అమెరికా గానీ.. సెబీ గానీ ఇంతవరకూ స్పందించలేదు. మరోవైపు, ఈ వ్యవహారంపై సెటిల్‌మెంట్‌కు సెబీ వద్ద బ్యాంక్ ఆఫ్ అమెరికా అప్లికేషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

## 75%శాతం సంపాదనను ఇచ్చేస్తా .. కుమారుడి మరణం వేళ వేదాంతా ఛైర్మన్ పునరుద్ఘాటన

బిలియనీర్, గనుల రంగ దిగ్గజ సంస్థ వేదాంతా అధిపతి అనిల్ అగర్వాల్ కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) హఠాత్తుగా మృతి చెందిన సంగతి తెలిసిందే . కుమారుడి మరణంతో తన జీవితంలో చీకట్లు కమ్మాయని అనిల్ ఎక్స్ వేదికగా భావోద్వేగ పూరిత పోస్ట్ పెట్టారు. అలాగే తమ సంపాదనలో 75 శాతాన్ని సమాజానికి ఇచ్చేస్తానని పునరుద్ఘాటించారు.

''కుమారుడు అగ్నివేశ్ (Agnivesh) ఎంతో త్వరగా మమ్మల్ని విడిచివెళ్లిపోయాడు. అతడి వయసు 49 ఏళ్లే. భవిష్యత్తు గురించి ఎన్నో కలలుండేవి. అమెరికాలో జరిగిన స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో కోలుకుంటున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో మమ్మల్ని విడిచివెళ్లిపోయాడు. జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా.. ఎంతో ఒదిగి ఉండేవాడు. ఒక ఫ్రెండ్‌లా నా వెంటే ఉండేవాడు. దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందని బలంగా నమ్మేవాడు. మా సంపాదనలో 75 శాతం సమాజానికి తిరిగిస్తానని అగ్నికి వాగ్దానం చేశాను. ఆ వాగ్దానాన్ని మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. అయితే, నువ్వు లేకుండా ఈ దారిలో ఎలా నడవాలో నాకు తెలియడం లేదు. కానీ నీ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను'' అని రాసుకొచ్చారు.అనిల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియ ఉన్నారు. ఆమె వేదాంతా లిమిటెడ్ బోర్డు మెంబర్. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. వేదాంతా అనుబంధ సంస్థ తల్వండి సోబో పవర్ లిమిటెడ్‌కు అగ్నివేశ్ ఛైర్మన్. అనిల్ అగర్వాల్ (Vedanta Chairman Anil Agarwal) నికర సంపద 330 కోట్ల డాలర్లు.

**ప్రధాని మోదీ సంతాపం..**

అగ్నివేశ్ అకాల మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ (PM Modi) దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు మీ కుటుంబానికి ధైర్యమివ్వాలని ప్రార్థిస్తున్నానంటూ అనిల్ అగర్వాల్ పోస్టుపై స్పందించారు.



## 2025లో 22.70 లక్షల విద్యుత్ వాహనాల విక్రయం



**విద్యుత్ వాహన (ఈవీ) రిటెయిల్ అమ్మకాలు, గతేడాదిలో 22,70,107కు చేరాయి. 2024లో అమ్ముడైన 19.5 లక్షల ఈవీలతో పోలిస్తే, ఈ సంఖ్య 16.37% అధికమని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) పేర్కొంది. ముఖ్యంగా విద్యుత్తు కార్ల విక్రయాల్లో 77% వృద్ధి నమోదు కావడం ఇందుకు సహకరించింది. '2025లో ప్రతి వాహన విభాగంలోనూ వృద్ధి కనిపించింది. క్షేత్ర స్థాయిలో విద్యుత్తు వాహనాల వినియోగం అధికమైంద'ని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ఉత్పత్తుల ఎంపికలో ఎక్కువ అవకాశాలు, ధర తగ్గడం వంటివి ఇందుకు సహకరించాయన్నారు. పర్యావరణ హితమైన ఈవీల వినియోగం ఇంకా పెరిగేందుకు, ప్రభుత్వ విధానాల కొనసాగింపుతో పాటు ఛార్జింగ్ వసతులు, రిటెయిల్ రుణాలు మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.**

## ఈ విమానాలు టైమ్‌కు వస్తాయ్.. ఇండిగో స్థానం తెలుసా..?



**గగనతల పరిమితులు, సిబ్బంది కొరత, విమానయాన రంగంలోని సవాళ్లను దాటుకొని ఎయిర్‌లైన్స్ సంస్థలు సమయానికి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి . అలా అత్యంత సమయపాలన పాటిస్తోన్న సంస్థల జాబితాను ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ సిరియం వెల్లడించింది. గత ఏడాదికి సంబంధించి ఆన్‌టైమ్ ఫెర్మామెన్స్ రివ్యూను విడుదల చేసింది.**

**ఏరోమెక్సికో వరుసగా రెండోఏడాది అత్యంత సమయ పాలన (90.02 per cent punctuality) కలిగిన ఎయిర్‌లైన్స్‌గా అగ్రస్థానంలో నిలిచింది**

**ఖతర్ ఎయిర్‌లైన్స్..84.42 శాతం ఆన్‌టైమ్‌తో ప్లాటినం విన్నర్‌గా నిలిచింది.**

**ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఫిలిప్పీన్ ఎయిర్‌లైన్స్ ప్రథమ స్థానంలో నిలిచింది. 83.12 శాతం ఆన్‌టైమ్ ప్రదర్శన చూపింది. ఇదే ప్రాంతంలో ఇండిగో ఆరో స్థానంలో ఉంది. 78.12 శాతం ఆన్‌టైమ్ ప్రదర్శన నమోదు చేసింది. ఇటీవల ఇండిగో (Indigo) విమానయాన సంస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. సిబ్బంది కొరత వంటి ఆపరేషనల్ సమస్యలతో వందల సంఖ్యలో విమానాలను రద్దు చేసింది. దాంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.**

## అమెజాన్‌లో శోభితా కొత్త సినిమా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!




దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ ప్రాజెక్ట్‌లు చేస్తూ తన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి శోభితా ధూళిపాళ్ల (Sobhita Dhulipala). ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'చీకటిలో'. తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ వివరాలను అమెజాన్ ప్రైమ్ ప్రకటించింది. జనవరి 23 నుంచి అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఇది స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రానున్న ఈ చిత్రానికి శరత్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. 'చీకట్లు కమ్ముకునే ముందే సంధ్య వచ్చేస్తుంది.. సిద్ధంగా ఉండండి' అని పంచుకున్న పోస్టర్ ఆసక్తికరంగా ఉంది.

### మాల్‌లో చుట్టు ముట్టిన అభిమానులు..

## నిధి అగర్వాల్ ఏమన్నారంటే?




ప్రభాస్ (Prabhas) కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందిన 'ది రాజాసాబ్' మూవీ ఈవెంట్‌లో నిధి అగర్వాల్ (Niddhi Agerwal) ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే. ఓ మాల్‌లో జరిగిన కార్యక్రమాలు అభిమానులు ఆమెను చుట్టుముట్టారు. దీంతో ఆమె ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నారు. వారి నుంచి తప్పించుకుని కారులో కూర్చొని రిలాక్స్ అయిన తీరు చూస్తే, ఆమె ఎంత ఇబ్బంది పడ్డారో అర్థం చేసుకోవచ్చు. అదొక దురదృష్టకరమైన సంఘటన అని నిధి తాజాగా అభిప్రాయపడ్డారు.

"ఆ రోజు అక్కడ జరిగింది నిజంగా ఓ దురదృష్టకరమైన సంఘటన. దాని గురించి నేను చాలా మాట్లాడాలి. కానీ, సరైన సమయంలో మాట్లాడతా. అదొక సున్నితమైన విషయం. పొరపాటున నేను ఏదైనా మాట్లాడితే, అది మరొక విధంగా దారి తీయొచ్చు. అందరికీ అవకాశం ఇచ్చిన దాన్ని అవుతాను. కచ్చితంగా మాట్లాడతాను. కానీ, అందుకు కాస్త సమయం కావాలి" అని అన్నారు.

"రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేను" అని నిధి చెప్పారు.

## జన నాయగన్' వాయిదా.. సినీ చరిత్రలోనే అతి పెద్ద రిఫండ్




సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్' వాయిదా పడిన (Jana Nayagan Postponed) సంగతి తెలిసిందే. సెన్సార్ (jana nayagan censor) సమస్యల కారణంగా ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ తెలిపింది. జనవరి 9న మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర బృందం ప్రకటించడమే కాదు, ఓవర్సీస్ సహా, పలు ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్‌కు అనుమతి కూడా ఇచ్చింది. ఇప్పుడు సినిమా వాయిదా పడటంతో టికెట్ డబ్బులను వెనక్కి తిరిగి ఇచ్చే ప్రక్రియ మొదలైంది. సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుందని అభిమానులు భావించారు. బుధవారం వరకూ బుక్ మై షో వేదిక 4.50 లక్షల టికెట్స్ అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో అమ్ముడయ్యాయి. ఇప్పుడు ఆ టికెట్‌స్‌కు సంబంధించిన మొత్తాన్ని బుక్ మై షో వెనక్కి ఇచ్చే ప్రక్రియ మొదలు పెట్టింది. బుక్ మై షో చరిత్రలోనే ఇదే అత్యధిక రిఫండ్ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇండియన్ సినీ చరిత్రలో ఈ స్థాయిలో టికెట్స్ క్యాన్సిల్ అయి, తిరిగి చెల్లించడం ఎప్పుడూ లేదని అంటున్నారు. మరోవైపు థియేటర్స్‌లో బుకింగ్ చేసుకున్న వాళ్లకు అక్కడే రిఫండ్ చేస్తున్నారు.

**వివాదాలతోనే విజయ్ కెరీర్ సావాసం...**


తమిళ స్టార్ విజయ్ (Vijay) సినిమాల విషయంలో వివాదాలు కొత్తమే కాదు. గత కొన్నేళ్లుగా ఆయన నటించిన సినిమాలన్నీ విడుదలకు ముందు వివాదమవడం, రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీయడం జరిగాయి. 'కావలన్'కు లా అండ్ ఆర్డర్ సమస్య రాగా, 'తుపాకి'పై రాష్ట్రంలో పలు చోట్ల ఆందోళనలు జరిగాయి. 'తలైవా' అయితే రాజకీయంగా దుమారం రేపింది. 'కత్తి'కి శ్రీలంకన్ వివాదం.. 'పులి'కి ఫైనాన్స్, డిస్ట్రిబ్యూషన్.. 'మెర్సెల్'కు జీఎస్టీ, యానిమల్ వెల్ఫేర్ నుంచి నోటీసులు.. 'సర్కార్'కు రాజకీయ విమర్శలు.. 'మాస్టర్'కు కొవిడ్ దెబ్బ.. 'వారిసు'కి తక్కువ థియేటర్స్ కేటాయించడంపై ఆందోళన.. 'లియో'కు పరిమిత షోలకు మాత్రమే అనుమతి ఇవ్వడం వంటి వాటితో విజయ్ సినిమాలు సర్వత్రా వార్తల్లో నిలిచాయి. ఇప్పుడు 'జన నాయగన్'కు సెన్సార్ సమస్య చుట్టుముట్టింది. సీబీఎఫ్‌సీ సూచనల మేరకు మార్పులు చేసినా, బోర్డు సభ్యుల్లో ఒకరి నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడంతో ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా ఆపేశారు. ఇది కాస్తా మద్రాసు హైకోర్టుకు చేరింది. జనవరి 9వ తేదీ ఉదయానికి తీర్పు వెల్లడిస్తామని కోర్టు చెప్పింది. దీంతో సినిమాను పూర్తిగా వాయిదా వేశారు.

**చిత్ర పరిశ్రమ నుంచి విజయ్‌కు పెరుగుతున్న మద్దతు**

'జన నాయగన్' వాయిదా పడటంతో సినీ ఇండస్ట్రీ నుంచి విజయ్‌కు మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే పలువురు దర్శకులు, నటులు ఆయన సినిమాకు మద్దతు తెలిపారు. పెద్ద సినిమాల పరిస్థితి ఇలా ఉంటే చిన్న సినిమాల పరిస్థితి ఇంకెలా ఉంటుందోనంటూ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ విచారం వ్యక్తం చేశారు. ఒక సినిమా విడుదలకు ముందు ఇలా జరగడం సరైనదని కాదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వినోద రంగంలో ఓటీటీ, శాటిలైట్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో థియేటర్‌ను మరింత ప్రోత్సహించాలని.. కానీ, అలా జరగడం లేదన్నారు. ఇది ఫిల్మ్ మేకర్స్‌పై మరింత ఒత్తిడిని పెంచుతుందన్నారు. చిన్న సినిమాలకు థియేటర్లు ఇవ్వకుండా చేస్తున్నారని, ఇది సినిమాను హత్య చేయడంతో సమానమన్నారు. అభిమానుల గొడవలు, రాజకీయ అంశాలు, వ్యక్తిగత అజెండాలు, వ్యతిరేక ప్రచారాలను పక్కన పెట్టి సినిమా కోసం అందరూ కలిసి ఒకతాటిపైకి వచ్చి పనిచేయాలన్నారు.

## ఆడిటోరియాన్ని ఊపేసిన చిరు 'హుక్ స్టెప్' సాంగ్.. వచ్చేసింది

చిరంజీవి కథానాయకుడి అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రంలో 'హుక్ స్టెప్' సాంగ్‌ను విడుదల చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఈ సాంగ్‌ను టెలికాస్ట్ చేయగా, అభిమానులే కాదు, వెంకటేశ్, అనిల్ రావిపూడి కూడా ఈ పాటకు డ్యాన్స్ వేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఈపాటను బాబా సెహగల్ ఆలపించారు. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి వచ్చిన పాటల్లో ఇదే హైలైట్ కావడం గమనార్హం. అంతేకాదు, సోషల్‌మీడియాను కూడా ఓ ఊపు ఊపేయడం ఖాయం.




## టాక్సిక్' సర్‌ప్రైజ్ వచ్చేసింది.. 'రాయ'గా రాక్‌స్టార్!




కేజీయఫ్' చిత్రాల తర్వాత యశ్ (Yash) నటిస్తోన్న సినిమా 'టాక్సిక్' (Toxic Movie). గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. నేడు ఈ రాక్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. యశ్ లుక్‌ను విడుదల చేస్తూ గ్లింప్స్‌ను రిలీజ్ చేసింది.

ఇందులో యశ్ రాయ పాత్రలో నటిస్తున్నట్లు తెలుపుతూ పవర్‌ఫుల్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ వ్యక్తి చాలా ప్రమాదకరం అంటూ పాత్రను పరిచయం చేస్తూ వీడియోను షేర్ చేసింది (Toxic: Introducing Raya). అయితే అందులో హింసతో పాటు మసాలా సీన్స్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతుండగా అభిమానులు యశ్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.


ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ (Huma Qureshi) ఎలిజిబెత్‌గా, నయనతార (Nayanthara) గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన వీరి ఫస్ట్‌లుక్ పోస్టర్లకు మంచి ఆదరణ లభించింది. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

## 15ఏళ్ల కిందట ఆ సినిమా కూడా వర్కవుట్ కాదన్నారు: ప్రభాస్



మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్ . ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడింది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మమనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం''అని ప్రభాస్ చెప్పారు .ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. ''బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడింది'' అని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.



## శ్రీలంక మాస్టర్ మైండ్.. వరల్డ్ కప్ విన్నింగ్ కోచ్‌తో ఒప్పందం




**టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు శ్రీలంక క్రికెట్ బోర్డు (SLC) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మెగా టోర్నీ కోసం తమ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ విక్రమ్ రాథోర్‌ను ఎస్‌ఎల్‌సీ నియమించింది. టీ20 వరల్డ్‌కప్ టోర్నీకి శ్రీలంక జట్టును సన్నద్ధం చేసేందుకు విక్రమ్ రాథోర్‌ను కన్సల్టెన్సీ ప్రాతిపదికన బ్యాటింగ్ కోచ్‌గా నియమించాము అని లంక క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది.**

రాథోర్ జనవరి 18న లంకతో జట్టుతో కలవనున్నాడు. ప్రపంచ కప్ ముగిసే వరకు జట్టుతోనే ఉండనున్నాడు. విక్రమ్‌కు కోచ్‌గా అపారమైన అనుభవం ఉంది. . 2019 సెప్టెంబర్ నుంచి 2024 జూలై వరకు భారత బ్యాటింగ్ కోచ్‌గా చేశారు. భారత్ 2024 టీ20 ప్రపంచ కప్ గెలవడంలోఅతడు కీలక పాత్ర పోషించాడు. బీసీసీఐ లెవల్ 3 కోచ్‌గా కొనసాగాడు.

అతడు ప్రస్తుతం ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు లీడ్ అసిస్టెంట్ కోచ్‌గా కూడా పనిచేస్తున్నాడు. కాగా శ్రీలంక ఇప్పటికే భారత మాజీ ఫస్ట్ క్లాస్ క్రికెటర్ రామ కృష్ణన్ శ్రీధర్‌ను తమ ఫీల్డింగ్ కోచ్‌గా నియమించింది. రాథోర్ భారత బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న సమయంలోనే ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీధర్ పనిచేశాడు.

**శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రపంచ కప్ లక్ష్యంగా భారత కోచింగ్ అనుభవాన్ని ఉపయోంచుకుంటుంది. అదేవిధంగా లెజెండరీ బౌలర్ లసిత్ మలింగ కూడా ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా సేవలందించనున్నాడు. కాగా ఈ పొట్టి ప్రపంచకప్‌కు శ్రీలంక, భారత్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. శ్రీలంక తమ లీగ్ మ్యాచ్‌లన్నింటని స్వదేశంలోనే ఆడనుంది. ఫిబ్రవరి 7 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది.**

## తిలక్ వర్మకు శస్త్రచికిత్స.. T20 WC ముంగిట భారత్‌కు షాక్




ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు టీమ్‌ఇండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయమైంది. దీంతో అతనికి శస్త్రచికిత్స చేశారు. తిలక్ కోలుకోవడానికి ఇంకా కొన్ని వారాలు పట్టొచ్చు. ఈ క్రమంలోనే జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు ఈ హైదరాబాదీ క్రికెటర్ దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మ్యాచ్‌లు రాజ్‌కోట్‌లో జరుగుతున్నాయి. హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ (Tilak Varma) నాయకత్వం వహిస్తుండగా.. ఇటీవల అతనికి పొట్ట కింది భాగంలో తీవ్రమైన నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు.

తక్షణమే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. దీంతో తిలక్ (Tilak Varma)కు సర్జరీ చేశారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. దీంతో మూడు, నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. ఫలితంగా కివీస్‌తో టీ20 సిరీస్‌కు ఈ కుర్రాడు అందుబాటులో ఉండడు. అతని స్థానంలో ఇప్పటివరకు మరొకరిని జట్టులోకి తీసుకోలేదు. ఏదిఏమైనా కొంతకాలంగా జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న తిలక్ టీ20 ప్రపంచ కప్ ముందు గాయపడటం టీమ్‌ఇండియాకు భారీ దెబ్బే. ఎందుకంటే అతను వరల్డ్ కప్‌లో ఆడినా ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన 2025 ఆసియా కప్ ఫైనల్‌లో ఈ హైదరాబాదీ బ్యాటర్ అదరగొట్టాడు. 53 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి భారత్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు.

## 17 ఏళ్ల షూటర్‌పై లైంగిక దాడి.. జాతీయ కోచ్ అంకుశ్‌పై

నేషనల్ షూటింగ్ కోచ్ అంకుశ్ భరద్వాజ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. జాతీయస్థాయి షూటర్ అయిన 17 ఏళ్ల యువతిపై ఫరీదాబాద్‌లోని ఓ హోటల్‌లో లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అంకుశ్‌పై హరియాణా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత షూటర్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. సాక్షుల నుంచి వాంగ్మూలాలను రికార్డ్ చేయడం, సీసీటీవీ ఫుటేజీని భద్రపరిచే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. దిల్లీలోని డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జాతీయస్థాయి షూటింగ్ పోటీల సందర్భంగా షూటర్‌పై ఈ లైంగిక దాడి జరిగింది. ఫరీదాబాద్‌లోని ఓ హోటల్ గదిలో ఆమె ఆటతీరును అంచనా వేయాలని పిలిపించి షూటర్‌పై.. అంకుశ్ ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు.ఈ ఘటన గురించి ఎవరికైనా చెబితే ఆమె కెరీర్‌ను నాశనం చేస్తానని, కుటుంబసభ్యులకు హాని కలిగిస్తానని కోచ్ బెదిరించాడు. హోటల్ నుంచి బయటకు వెళ్లి బాధిత షూటర్ కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద ఫరీదాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 'కేసు తీవ్రత దృష్ట్యా మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలను ధ్రువీకరించడానికి సంఘటన జరిగిన రోజు హోటల్‌లోని అన్ని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను వెంటనే భద్రపరిచి తమకు అందజేయాలని నిర్వాహకులను కోరాం' అని పోలీసులు తెలిపారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) నియమించిన 13 మంది జాతీయ పిస్టల్ కోచ్‌లలో అంకుశ్ ఒకరు. షూటర్‌పై లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో విచారణ ముగిసేవరకు అంకుశ్ భరద్వాజ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఎన్ఆర్ఏఐ సెక్రటరీ జనరల్ పవన్ కుమార్ తెలిపారు.



## మద్యం మత్తులో గొడవ.. హ్యారీ బ్రూక్‌పై చేయిచేసుకున్న బౌన్సర్




ఇంగ్లాండ్ వన్డే, టీ20 కెప్టెన్ హ్యారీ బ్రూక్ (Harry Brook) మద్యం మత్తులో ఓ నైట్‌క్లబ్ వద్ద గొడవకు దిగాడు. దీంతో బ్రూక్‌పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు. గతేడాది నవంబర్ 1న న్యూజిలాండ్‌తో మూడో వన్డేకు ముందు రోజు ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి హ్యారీ బ్రూక్ తన సహచర క్రికెటర్లు జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్‌తో కలిసి వెల్లింగ్‌టన్‌లో ఓ నైట్ క్లబ్‌కు వెళ్లాడు. మద్యం తాగి ఉన్నాడని అనుమానించి బ్రూక్‌ను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం జరగ్గా.. ఇంగ్లాండ్ కెప్టెన్‌పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు.

ఈ వివాదంపై హ్యారీ బ్రూక్ స్వయంగా టీమ్ మేనేజ్‌మెంట్‌కు వివరణ ఇచ్చాడని సమాచారం. ఘటనపై విచారణ చేపట్టిన ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు బ్రూక్‌కు 'ఫైనల్ వార్నింగ్' ఇచ్చి దాదాపు 30,000 పౌండ్లు జరిమానాగా విధించింది. బ్రూక్ తన ప్రవర్తనకు క్షమాపణలు చెప్పాడు. 'నా చర్యలు తప్పు అని నేను పూర్తిగా అంగీకరిస్తున్నాను. ఇది నాకు, మా జట్టుకు ఇబ్బంది కలిగించింది,. ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం. జరిగిన దాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తాను. సహచరులు, కోచ్‌లు, మద్దతుదారులను నిరాశపరిచినందుకు నేను తీవ్రంగా చింతిస్తున్నాను' అని ఒక ప్రకటన విడుదల చేశాడు. యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లిన ఇంగ్లాండ్ ప్లేయర్లు ఫుల్లుగా మద్యం తాగి ఎంజాయ్ చేసినట్లు వార్తలొచ్చాయి. రెండో, మూడో టెస్టుకు మధ్య లభించిన 9 రోజుల విరామంలో నోసా బీచ్ రిసార్ట్‌లో మద్యం మత్తులో మునిగితేలారని కథనాలు వచ్చాయి.

## యాషెస్ సిరీస్.. ఐదో టెస్టులో ఆస్ట్రేలియా విజయం



సిడ్నీ: ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-1తో కైవసం చేసుకుంది. సిడ్నీ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 302/8తో ఐదో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్ 342 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ జట్టు నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ట్రావిస్ హెడ్ (29), జాక్ వెదర్‌లాండ్ (34), మార్నస్ లబుషేన్ (37) పరుగులు చేయగా.. స్టీవ్ స్మిత్ (12), ఉస్మాన్ ఖవాజా (6) విఫలమయ్యారు. అలెక్స్ కేరీ (16*), కామెరూన్ గ్రీన్ (22*) నాటౌట్‌గా నిలిచారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ (3/42) మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 384, ఆస్ట్రేలియా 567 పరుగులకు ఆలౌటయ్యాయి. 4 మ్యాచ్‌లు ఆడి 26 వికెట్లు పడగొట్టిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. ఈ మ్యాచ్‌తో ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సిడ్నీ టెస్టు తర్వాత తాను రిటైరవనున్నట్లు ఖవాజా మ్యాచ్ ప్రారంభానికి ముందే ప్రకటించాడు.

## హార్దిక్ పాండ్య, జితేశ్ శర్మ మెరుపు హాఫ్ సెంచరీలు.. భారీ స్కోరు చేసిన బరోడా



రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా చండీగఢ్‌తో బరోడా తలపడుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 49.1 ఓవర్లలో 391 పరుగులకు ఆలౌటైంది. ప్రియాంషు మోలియా (113; 106 బంతుల్లో) సెంచరీతో ఆకట్టుకున్నాడు. హార్దిక్ పాండ్య (75; 31 బంతుల్లో 2 ఫోర్లు, 9 సిక్స్‌లు), జితేశ్ శర్మ (73; 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకాలతో విరుచుకుపడ్డారు. విష్ణు సోలంకి (54; 49 బంతుల్లో) కూడా హాఫ్ సెంచరీతో మెరిశాడు. నినాద్ అశ్విన్‌కుమార్ (38), కృనాల్ పాండ్య (20) పరుగులు చేశారు. చండీగఢ్ బౌలర్లలో జగ్జీత్ సింగ్ 3, రోహిత్ దండా 2, హర్తేజస్వి కపూర్ 2, నిశుంక్ బిర్లా, విషు కశ్యప్, తరణ్‌ప్రీత్ సింగ్ ఒక్కో వికెట్ సాధించారు.

కష్టాల్లో మహారాష్ట్ర.. సెంచరీతో ఆదుకున్న రుతురాజ్

గోవాతో జరుగుతున్న మ్యాచ్‌లో మహారాష్ట్ర బ్యాటింగ్ ముగిసింది. 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఒక దశలో మహారాష్ట్ర 52 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (134*; 131 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) జట్టును ఆదుకున్నాడు. ఎనిమిదో స్థానంలో వచ్చిన విక్కీ ఓస్త్వాల్ (53; 82 బంతుల్లో) రాణించాడు. చివర్లో రాజవర్ధన్ హంగర్గేకర్ (32*; 19 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. గోవా బౌలర్లలో వాసుకి కౌశిక్ 3, అర్జున్ తెందూల్కర్, దీప్రాజ్ గాంకర్, దర్శన్ మిసల్, లలిత్ యాదవ్ తలో వికెట్ తీశారు.

## ఒక్క పరుగు తేడాతో పంజాబ్ సంచలన విజయం.. సర్ఫరాజ్ మెరుపులు వృథా

జైపుర్: విజయ్ హజారే ట్రోఫీ (Vijay Hazare Trophy)లో పంజాబ్ సంచలన విజయం సాధించింది. గెలుపు ఆశల్లేని స్థితి నుంచి చివరి వరకు గొప్పగా పోరాడి ఒక్క పరుగు తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 45.1 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. లక్ష్యఛేదనలో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ముంబయి సునాయసంగా విజయం సాధించేలా కనిపించింది. కానీ, వరుసగా వికెట్లు కోల్పోయి 26.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (62; 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు వృథా అయ్యాయి. పంజాబ్ కెప్టెన్ అభిషేక్ శర్మ వేసిన ఓవర్‌లో సర్ఫరాజ్ వరుసగా 6,4,6,4,6,4 బాదేశాడు. అతను 15 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. టోర్నీ చరిత్రలో ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ.కెప్టెన్ శ్రేయస్ (45; 34 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఒక దశలో 17.2 ఓవర్లకు 169/3 స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచిన ముంబయి.. తర్వాత అనూహ్యంగా వికెట్లు కోల్పోయి ఓటమిని మూటగట్టుకుంది. సూర్యకుమార్ యాదవ్ (15), శివమ్ దూబె (12), హార్దిక్ తమోర్ (15) క్రీజులో ఎక్కువసేపు నిలవకపోవడం ముంబయిని కొంపముంచింది. పంజాబ్ ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం గమనార్హం. స్పిన్నర్ మయాంక్ మార్కండే (4/31) సత్తా చాటగా.. పేసర్ గుర్నూర్ బ్రార్ 57 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ అభిషేక్ శర్మ (8), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (11) విఫలమయ్యారు. రమణ్‌దీప్ సింగ్ (72) అన్మోల్‌ప్రీత్ సింగ్ (57) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఇప్పటికే ముంబయి, పంజాబ్ నాకౌట్ దశకు అర్హత సాధించాయి.




## ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీ రూ. 675 కోట్లు



మెల్‌బోర్న్: ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోటీపడే టెన్నిస్ ప్లేయర్ల ప్రైజ్‌మనీ చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 111.5 మిలియన్ ఆసీస్ డాలర్లు. అంటే మన కరెన్సీలో అక్షరాల రూ. 675 కోట్లు.

గత ఏడాది ప్రైజ్‌మనీ 96.5 మిలియన్ ఆసీస్ డాలర్ల (రూ.584 కోట్లు)తో పోల్చితే 16 శాతం పెరిగిందని టెన్నిస్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటీవ్ క్రెయిగ్ టిలే వెల్లడించారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 4.15 మిలియన్ ఆసీస్ డాలర్లు (రూ.25.15 కోట్లు) చొప్పన అందజేస్తారు.

సింగిల్స్ విజేతల ప్రైజ్‌మనీ ఏకంగా 19 శాతం పెంచారు. అలాగే మెయిన్ డ్రా ఆడే సింగిల్స్, డబుల్స్ ఆటగాళ్ల ప్రైజ్‌మనీ కూడా 10 శాతం మేర పెంచినట్లు నిర్వాహకులు ఆయన తెలిపారు. 2023 నుంచి టెన్నిస్ ప్లేయర్లకు ప్రోత్సాహకాలను భారీ పెంచుతున్నామని ఆయన చెప్పారు. ఈ నెల 18 నుంచి మెల్‌బోర్న్ ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ జరుగుతుంది.

### క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ

బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం సాకేత్ మైనేని–ఆదిల్ కల్యాణ్‌పూర్ జోడీ 7–6 (7/3), 4–6, 13–11తో సుమిత్ నగాల్ (భారత్)–లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా) ద్వయంపై పోరాడి గెలిచింది.

ఈ మ్యాచ్‌లో సాకేత్ జంట 3 ఏస్‌లు బాదగా... సుమిత్ నగాల్ ద్వయం 8 ఏస్‌లు సంధించింది. 3 డబుల్ ఫాల్ట్‌లు చేసిన సాకేత్–ఆదిల్ జోడీ... ఒక బ్రేక్ పాయింట్ సాధించింది. సాకేత్ జంట మొత్తం 78 పాయింట్లు గెలుచుకోగా... నగాల్ ద్వయం 69 పాయింట్లకు పరిమితమైంది. గురువారం జరగనున్న క్వార్టర్ ఫైనల్లో ఆర్థర్ రేమాండ్–లుకా సాంచెజ్ (ఫ్రాన్స్) ద్వయంతో... సాకేత్–ఆదిల్ జంట అమీతుమీ తేల్చుకోనుంది.